క్లుప్తంగా

ఆచార్య కృపాచారికి సన్మానం



తెనాలి అర్బన్: జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిని బోసు రోడ్డులోని టౌన్ చర్చిలో పాస్టర్లు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవరెండ్ దేవరపల్లి ఏసు రత్నం మాట్లాడుతూ ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్, యునెస్కో సంయుక్త ఆధ్వర్యంలో కృపాచారికి పురస్కారాన్ని అందించడం అభినందనీయమని తెలిపారు. ఆయన మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెవరెండ్ ప్రకాష్‌బాబు, రెవరెండ్ డేవిడ్ ఇమ్మానుయేలు, సంఘ పెద్దలు ఐనంపూడి డేవిడ్ రాజు, చల్లపల్లి ఫ్రాన్సిస్, వేమయ్య, ఘంటయ్య, అంబేద్కర్, రాజకుమారి, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

ఈతల పోటీల్లో విజేతలకు సత్కారం



తెనాలి రూరల్: మంగళగిరిలో ఇటీవల నిర్వహించిన ఈతల పోటీల్లో విజేతలకు సంగం జాగర్లమూడి స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. పట్టణానికి చెందిన రావి కిరణ్ కుమార్, మారుపూడి శ్రీనివాసరావు, నాగ బ్రహ్మారెడ్డి, నెల్సన్ మాస్టర్‌లు పోటీల్లో పాల్గొని బహుమతులను సాధించారు. ఈ నేపథ్యంలో సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను సత్కరించారు. సిమ్మర్స్ అసోసియేషన్ నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎ.నారాయణ, రామ్మోహన్ మాస్టర్, అవనిగడ్డ ఆంజనేయులు, రావి రాంబాబు, సాయి, చందు నాయుడు, రామారావు, అర్జున్, రావి మణికంఠ, జొన్నాదుల మణికంఠ, లక్ష్మి, తేజశ్రీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఏషియన్ వాస్క్యులర్ హస్పిటల్ సహకారంతో ఆదివారం బీసీ కాలనీలోని పట్టణ రంగస్థల కళాకారుల భవనంలో ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రంగ స్థల కళాకారులకు డాక్టర్ దీపక్, డాక్టర్ మధులు సేవలు అందించారు. రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకట నారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, సినీ రచయిత బుర్రా సాయి మాధవ్, రంగస్థల కళాకారుల సంఘ అధ్యక్షులు బుర్రా విజయలక్ష్మి, కార్య నిర్వాహక అధ్యక్షులు గరికపాటి సుబ్బారావు, దేవరపల్లి భవాని, నాయకులు రాజేంద్రప్రసాద్, అర్జున్, రఫీ, పావులూరి రాంబాబు పాల్గొన్నారు.

స్టేడియంలో గడ్డి, పిచ్చి మొక్కల తొలగింపు పూర్తి



తెనాలి రూరల్: చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని ఇండోర్ స్టేడియం ఆవరణను స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు శుభ్రం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోవడంతో పాములు, ఇతర విష కీటకాలు సంచరిస్తున్నాయి. వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా స్టేడియం ఇన్‌చార్జ్ నాగరాజు ఆవరణను శుభ్రం చేసేందుకు పూనుకున్నారు. స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, అభ్యుదయ వాకర్స్ అసోసియేషన్, స్టేడియంలో ఏరోబిక్స్- జుంబా డాన్స్ నేర్చుకుంటున్న వారికి ఆయన విషయం తెలిపారు. దీంతో అంతా కలసి స్టేడియాన్ని వారం రోజులుగా శుభ్రం చేశారు. ట్రాక్టర్, పొక్లెయిన్, రోటవేటర్ ద్వారా పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. ఆదివారం నాటికి పనులు పూర్తయ్యాయి. కార్యక్రమంలో కన్నెగంటి శ్రీనివాసరావు, గోగినేని రామకృష్ణ, బోడాడ అనిల్, రుద్రరాజు మధుసూదనరాజు, శివ గోపి, శేఖర్, పుట్టా జనార్దనరావు పాల్గొన్నారు. స్టేడియం ఇన్‌చార్జి నాగరాజు, కోచ్ గోపి పర్యవేక్షించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

- కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్
- పాలనను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, పరిపాలనను గాలికొదిలేసిందని, అక్రమ కేసులు, వేధింపులతో రాక్షస పాలన కొనసాగిస్తోందని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ధ్వజమెత్తారు. గ్రామ, వార్డు, అనుబంధ కమటీల నియామకంలో భాగంగా ఆదివారం రాత్రి రూరల్ మండల గ్రామం కొలకలూరులో ప్రసాదం భాస్కరరావు ఇంటి ఆవరణలో ఏర్పాటైన సమావేశంలో శివకుమార్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటినా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలుచేయ కుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. బెల్టు షాపులపై వస్తున్న ఆదాయం సరిపోవడం లేదని కూటమి నేతలు నకిలీ మద్యం తయారు చేయిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తున్న రాకెట్ ఇటీవలే బయటపడిందని గుర్తు చేశారు. ప్రభుత్వమే నిర్వహించాల్సిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. ఫలితంగా భవిష్యత్‌లో పేద విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షగా మారుతుందని శివకుమార్ అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన సమావేశంలో పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్‌గా ప్రసాదం సురేష్‌ను ఎన్నుకున్నారు. అక్కడే సంతకాల సేకరణ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, నేతలు గంపల శివనాగేశ్వరరావు, కాలిశెట్టి ఫణి కుమార్, కోడూరి లూకా, ప్రసాదం రాధా, తులాబందుల కోటేశ్వరరావు, పోలిశెట్టి కోటేశ్వరరావు, తన్నీరు శ్రీనివాసరావు, తాడిబోయిన యలమందరావు, కుర్రా జస్వంత్ యాదవ్, కమాదుల స్వామి, పినపాటి రవి కిరణ్, బత్తుల గోపి, కోపల్లె సురేష్, పినపాటి అనిల్, మల్లవరపు భరత్, కొలకలూరి పాపారావు పాల్గొన్నారు.

పీపీపీని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం పేరుతో ప్రైవేటుకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన వస్తోంది. పేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందకుండా చేసే పీపీపీ విధానాన్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ, వార్డు, అనుబంధ కమిటీలను నియామకం చేసుకుంటూ, వాటి ఆధ్వర్యంలో సంతకాల సేకరణను చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి రూరల్ కొలకలూరులో జరిగిన కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు.

మనిషి జీవితంలో ఫొటో చక్కని అనుభూతి



లోగోను ఆవిష్కరిస్తున్న త్రీటౌన్ సీఐ సాంబశివరావు

తెనాలి అర్బన్: మనిషి జీవితంలో జరిగిన అనేక సందర్భాలను కెమెరాలో బంధించి మధురానుభూతిని కలుగజేసేవారు ఫొటోగ్రాఫర్‌లని త్రీటౌన్ సీఐ సాంబశివరావు పేర్కొన్నారు. ఆంధ్రా ప్యారిస్ వీడియో అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రారంభోత్సవాన్ని సుల్తానాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. సంస్థ లోగోను సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపకులు పిల్లి ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ సంక్షేమం కోసం సంస్థ పాటుపడుతుందని తెలిపారు. ప్రతి సభ్యుడికీ ఐడీ కార్డులు, రూ.10లక్షల ప్రమాద బీమాను అందిస్తామని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కాళిదాసు చైతన్య, కార్యదర్శిగా గ్లోరియస్ నాగరాజు, ఉపాధ్యక్షునిగా ఆనంద్ డిసౌజా, ప్రధాన కార్యదర్శిగా షేక్ రఫీ, ట్రెజరర్‌గా కొల్లి భరత్ కుమార్ ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు. వీరికి నియామక పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రసాద్ ల్యాబ్ అధినేత ప్రసాద్, నాయకులు విజయ సారథి, శేఖర్, రాజు, శ్రీకాంత్, శివ,సాగర్, సూర్య, బాజీ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

అత్తోట(కొల్లిపర): మండల పరిధిలోని అత్తోటలో ఆదివారం పేకాటాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.7600తో పాటు మూడు సెల్ ఫోన్‌లు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మట్టి ప్రమిదలు, మిఠాయిల పంపిణీ



తెనాలి అర్బన్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్పవృక్ష సంస్థ ఆధ్వర్యంలో మార్వాడీ గుడి సమీపంలో ఆదివారం సాయంత్రం మట్టి ప్రమిదలు, మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు హరికృష్ణ, సంస్థ నిర్వాహకులు అమన్ జైన్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి మద్దతుగా నిలవాలి



తెనాలి అర్బన్: ప్రధాని మోదీకి భారతీయులంతా మద్దతుగా నిలవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అనంతాచార్యులు కోరారు. ఆత్మ నిర్భర భారత్ కార్యక్రమంలో భాగంగా నియోజవర్గ ముఖ్య నాయకులు సమావేశాన్ని ఆదివారం తెనాలిలో నిర్వహించారు. మూర్తి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు మైలా హరికృష్ణ, మండల అధ్యక్షులు నందకిశోర్, కృష్ణ చైతన్య, గోళ్ల దేవరాజు, రాజు, రతన్ రాజు, కావూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా నిరసన

మంగళగిరి టౌన్: భారత్‌పై అమెరికా వేస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమెరికా నుంచి భారత దేశానికి పన్నులు లేకుండా డెయిరీ ఉత్పత్తులను, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ట్రంప్ భారత ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నారన్నారు. ఇది అమలు జరిగితే వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడుతుందని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలయ్యే పరిస్థితి వస్తుందన్నారు. వీసాల పునరుద్ధరణకు అనుమతి వస్తుందో రాదో అన్న భయంతో ఇండియాకు వస్తే తిరిగి వెళ్లలేమన్న నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ట్రంప్ ఆంక్షలతో ఎప్పుడు ఉద్యోగం పోతుందో తెలియని పరిస్థితుల్లో భారతీయులు ఉన్నారని పేర్కొన్నారు. అమెరికా వేస్తున్న సుంకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, దీనిపై భారత్ ప్రయోజనాల కోసం ట్రంప్‌ను ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి మండల అధ్యక్షులు అజయ్‌కుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి దుర్గారావు, చేనేత కార్మిక సంఘం నాయకులు సీతా రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సందడి



ప్రమిదలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు



కొనుగోలుదారులతో బాణసంచా దుకాణం వద్ద సందడి

చీకటి వెలుగుల రంగేళి... జీవితమే ఓ దీపావళి అంటూ పండుగకు మంగళగిరి నియోజకవర్గ ప్రజలు సిద్ధమయ్యారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో సందడి నెలకొంది. కొత్త దుస్తులు, టపాకాయలు, లక్ష్మీ పూజకు సామగ్రి కొనుగోలులో నిమగ్నమయ్యారు. పండుగ పురస్కరించుకుని పూల ధరలకు రెక్కలొచ్చాయి. మంగళగిరి పట్టణ పరిధిలో బాణసంచా కొనుగోలుకు ఆదివారం ఉదయం నుంచే ప్రజలు తరలివచ్చారు.

\- మంగళగిరి టౌన్

పొలాల్లోకి వర్షం నీరు



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. ప్రస్తుతం మాగాణి, అరటి, ఇతర పంటలకు ఎటువంటి నష్టం లేదు. ఆకుకూర మడుల్లోకి భారీగా వర్షపునీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ శివారు ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తుంటారు. ఆకు కూరలు సాగుచేసే రైతులు ఒక్కొక్క ఎకరం రూ.లక్ష చొప్పున కౌలుకు తీసుకున్నారు. ఎకరంలో ఆకు కూరల మడులు వేయడానికి దుక్కి దున్నడం, మడులు ఏర్పాటు చేయడం, కట్టలు వేయడం, విత్తనాల కొనుగోలుకు మరో రూ.50 వేలు ఖర్చు అవుతుంది. భారీ వర్షాలకు నష్టపోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణ మండపానికి వంద కుర్చీల బహూకరణ



తాడేపల్లి రూరల్: ఉండవల్లిలో అమరజీవి చిట్యాల ఐలమ్మ రజక కల్యాణ మండపానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సభ్యులు 100 కుర్చీలను ఆదివారం బహూకరించారు. కార్యక్రమంలో మండప నిర్వహణ కమిటీ కన్వీనర్ వల్లభాపురం వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్రరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రామకృష్ణ, మున్నంగి వివేకానందరెడ్డి, ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, కల్యాణ మండప సభ్యులు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభం

తాడేపల్లి రూరల్: మెల్లంపూడి–నూతక్కి మధ్య గ్రావెల్ రోడ్ పనులకు పలువురు టీడీపీ నాయకులు ఆదివారం శంకుస్థాపన చేశారు. నాయకులు మాట్లాడుతూ మెల్లంపూడి గ్రామ జెడ్పీ రోడ్డు నుంచి మాతృఛాయ అనాథాశ్రమం వరకు 18 లక్షల వ్యయంతో గ్రావె ల్‌రోడ్ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ముస్లింల భద్రతకు ప్రత్యేక చట్టం రూపొందించాలి

మంగళగిరి టౌన్: ముస్లింల భద్రతకు ప్రత్యేక అట్రాసిటీ చట్టం రూపొందించాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాలావుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఈద్గా ఫంక్షన్ హాలులో ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూను రాష్ట్ర రెండవ భాషగా ప్రకటించినా అధికార వ్యవహారాల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పరిసర ప్రాంతాల్లో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలన్న తమ వేదిక డిమాండ్‌పై చర్యలు చేపడితే హర్షిస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు చైర్మన్, కౌన్సిలర్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్, ఉపాధ్యక్షులు మౌలా బేగ్ అలి, రాష్ట్ర ట్రెజరర్ అబ్దుల్ కలాం, నాయకులు నూర్జాన్, అబ్దుల్లా, నజీమా, అనీషా, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సాంబశివరావు

తెనాలి రూరల్: పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాల్లో ప్రమేయం ఉన్నట్టు తెలిస్తే సహించేది లేదని త్రీ టౌన్ సీఐ ఎస్.సాంబశివరావు హెచ్చరించారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో ముద్దాయిలు, రౌడీషీటర్లు, నేరస్తులకు ఆదివారం సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో వారు చేసిన నేరాలు, ప్రస్తుత వృత్తి, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందరిపై నిఘా ఉంటుందని సూచించారు. పట్టణంలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే ముందుగా పాత నేరస్తులనే విచారిస్తామని స్పష్టం చేశారు. ఇక నేరాల జోలికి పోవద్దని, కుటుంబాల కోసమైనా మారి మంచిగా జీవించాలని చెప్పారు. అనంతరం సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో రాత్రిపూట యువకుల సంచారం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించానని, రాత్రి 11 గంటల అనంతరం అకారణంగా రోడ్ల మీదకు వచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మద్యం, గంజాయి తాగి రోడ్లపై తిరుగుతున్నట్టు సమాచారం వస్తోందని, ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులుగా ఎంపికైన వారితో ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి రూరల్: డీఎస్సీ ద్వారా ఎన్నికైన ఉపాధ్యాయులంతా బాధ్యతగా పని చేయాలని శాసన మండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని తెనాలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కోగంటి రోహిత్ ఆధ్వర్యంలో ఆదివారం ఆలపాటి నగర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో భావి పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతి బాబు, నిర్వాహకులు రంగాజీ, పీడీ బుజ్జి, సుంకర హరికృష్ణ, ఖుద్దూస్, వసంతం అశోక్‌వర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాల అధిరోహణ



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు



అతిథులను సన్మానిస్తున్న అధ్యాపకులు

తెనాలి అర్బన్: విద్యలో రాణించడం వల్ల ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ ఈ. దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. తెనాలిలోని జూనియర్ కళాశాలలో ఆదివారం ఫేర్‌వెల్ పార్టీని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకం అన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పలు నృత్యాలు చేశారు. అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ వై. చంద్రశేఖర్, అసోసియేట్ డీన్ బి. తిరుపతిరావు, ఎ. రామకృష్ణారెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుడి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరం అడ్డరోడ్డు సమీపంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఏడో వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు జరిగాయి. వేమవరం గ్రామానికి చెందిన సీతారామ భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. మధ్యాహ్నం మూడు వేల మందికి అన్నదానం జరిగింది.

ముత్యాలరావుకు నివాళి

తాడేపల్లి రూరల్: ప్రజా సంఘాల్లో రాణించిన వ్యక్తి ముత్యాలరావు అని సీపీఎం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం తాడపల్లి పట్టణ పరిధిలోని మేకా అమారెడ్డి భవన్‌లో భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డీవైఎఫ్ఐ) నాయకుడు సోలా ముత్యాలరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గాదె సుబ్బారెడ్డి, విజయబాబు, బాబూరావు, దశరథరామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనతో విధిరాత మారుతుంది

తాడేపల్లి రూరల్: దువా(ప్రార్థన)తో విధిరాత మారుతుందని జమియత్ అహ్లె హదీస్ గుంటూరు జిల్లా అమీర్ జనాబ్ అబ్దుల్ రహమాన్ అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం మస్జిద్ ఎ తౌహిద్‌లో ఆదివారం ధార్మిక సమావేశాన్ని నిర్వహించారు. అల్లాతో మానవ సంబంధం ఎలా ఉండాలో అబ్దుల్ రహమాన్ ప్రసంగించారు. సమస్త ప్రశంసలు, సకల ఆరాధనలు, సర్వజీవ పరిపోషకుడు, విశ్వవ్యవస్థ ఆధార భూతుడైన అల్లాకు మాత్రమే శోభిస్తాయని చెప్పారు. దువా అంటే అల్లాను ప్రార్థించడం, వేడుకోవడమని తెలిపారు. సమావేశంలో గుంటూరు జిల్లా జిమయత్ అహ్లె హదీస్ ప్రధాన కార్యదర్శి జనాబ్ అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.